

'ఆడుదాం ఆంధ్ర'లో ఆడండి

శ్రీకాళహస్తిలో ర్యాలీ..

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి

అతిపెద్ద క్రీడా వేదికనా ఆడుదాం– ఆంధ్రాలో ఆడి యువత తమ సామర్థ్యాలను వెలికితేయాలని స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్నారు. ఆడుదాం–ఆంధ్ర క్రీడల పోటీలపై అవగాహన కల్పించడంలో భాగంగా స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల నుంచి 2కే రన్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం యువతకు మంచి అవకాశమన్నారు. ప్రస్తుతం యువతలో ఫిజికల్ ఫిట్నెస్ సరిగ్గా ఉండడం లేదనీ, ప్రతిఒక్కరికి ఇది ఒక చక్కటి అవకాశం అని తెలిపారు. ఆడుదాం ఆంధ్ర రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద క్రీడా సంబరమనీ, గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఆడుదాం ఆంధ్రలో యువ క్రీడాకారులందరూ పాల్గొని మీ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కోరారు. దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షుడు పగడాల రాజు, ముత్యాల పార్థసారథి, బోర్డు మెంబర్స్ మున్నా, జయశ్యం, మార్కెట్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ లక్ష్మమనేని కష్ణ, తిరుకాల మల్లికార్జున్ గౌడ్, రాము గుప్తా, ఆర్కుడు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి సిటీ: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు జిల్లా క్రీడాభివద్ధిశాఖ అధికారి ఆధ్వర్యంలో తిరుపతి నగరంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ నుంచి టౌన్ క్లబ్ మీదుగా, మహతి ఆడిటోరియం నుంచి, తిరిగి స్పోర్ట్స్ కాంప్లెక్స్ వరకు ప్రదర్శన సాగింది. ఈకార్యక్రమాన్ని తిరుపతి జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు ఎలమంచిలి ప్రవీణ్ ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం అద్భుతమైనదని, ఈ కార్యక్రమం ద్వారా వార్డుస్థాయి నుంచి గ్రామస్థాయి, మండల ,కాన్స్టెన్సీ జిల్లాస్థాయి, రాష్ట్ర స్థాయి వరకు ఉచిత శిక్షణ ఇస్తారన్నారు. స్ఫూర్తిని నింపే ఈ కార్యక్రమంలో ఎంతోమంది క్రీడాకారులు ప్రతిభ బయటపడుతుందని అన్నారు. దీని ద్వారా జాతీయ అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు బయటపడతారని పేర్కొన్నారు. షాప్ శిక్షకులు, డిఎస్డిఎస్ సయ్యద్ సాహెబ్ మాట్లాడుతూ దాదాపు రాష్ట్రవ్యాప్తంగా 1,50,000 మంది క్రీడాకారులు ఇందులో నమోదు చేసుకున్నారని, వారందరికీ క్రీడా దుస్తుల్ని పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో శాప్ శిక్షకులు చక్రవర్తి, గోపి, వినోద్, లక్ష్మీకరణ, శశి, హిందూజా, నీలిమ, ప్రేమ్, వినోద్ డీఈవో శేఖర్, స్కూల్ గేమ్స్ సెక్రెటరీ విజయ కుమారి, జెన్ స్పోర్ట్స్ అకాడమీ కిరణ్ కుమార్, వివిధ స్కూల్స్, కాలేజీల పీడీలు, పీఈటిలు, మున్సిపల్ కార్పొరేటర్స్, కోఆప్షన్ మెంబర్స్, విద్యార్థులు క్రీడాకారులు పాల్గొన్నారు.

తిరుపతిలో ర్యాలీ..

సమస్యలు పరిష్కారమయ్యేంత వరకూ...

పోరాటం ఆపే ప్రసక్తే లేదు..

తిరుపతిలో..

13వ రోజుకు అంగన్వాడీల సమ్మె

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి

తమ న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం స్థానిక శ్రీకాళహస్తి ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సిఐటియు, ఐఎఫ్టీయూ, ఏఐటీయూసీ అనుబంధ సంఘాల అంగన్వాడీ నాయకులు చేస్తున్న నిరవధిక సమ్మె ఆదివారం 13వ రోజుకు చేరుకుంది. సీఐటీయూ జిల్లా కోశాధికారి, అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు రాజేశ్వరి సమ్మెకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. అంగన్వాడీల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. రెండు వారాలనుంచి అంగన్వాడీలు నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నుంచి కనీస స్పందిన లేకపోవడం బాధాకరమన్నారు. రూ.26వేల వేతనం, గ్రాట్యుటి అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వకుంటే సమ్మె విరమణ జరగదన్నారు. కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు, ఉద్యోగ సంఘాలు తమకు మద్దతుగా నిలిచాయనీ, ప్రజా ఉద్యమంగా మారకముందే ప్రభుత్వం దిగొచ్చి అంగన్వాడీ సంఘాలతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు అంగేరి పుల్లయ్య, పెనగడం గురవయ్య, గంధం మణి, రేవతి, పుష్ప, సౌజన్య, రాజా, ఐఎఫ్టీయూ నాయకులు భారతి, సక్కుభాయమ్మ, స్వర్ణ పాల్గొన్నారు.

రేణిగుంట: పట్టణంలోని మంచినీళ్లగుంట పాత తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేపట్టిన సమ్మె ఆదివారానికి 13వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు హేమలత సమ్మె శిబిరం వద్దకు విచ్చేసి రిలే నిరాహార దీక్షల చేస్తున్న విజయలక్ష్మి, ధనమ్మ, హైమావతి, కవిత, లక్ష్మీ, గీత, చంద్రమ్మ, లక్ష్మి, మునెమ్మ, మునిలక్ష్మీ పూలమాలవేసి అభినందనలు తెలిపారు. సిఐటియు ఏర్పేడు మండల కార్యదర్శి కరీముల్లా, సిపిఎం సీనియర్ నాయకులు వెంకటరమణ, కెవిపిఎస్ మండల కార్యదర్శి సెల్వరాజ్, ఈశ్వరమ్మ పాల్గొన్నారు. బాలాయపల్లిలో అంగన్వాడీల సమ్మెను 13వ రోజూ కొనసాగించారు.

గూడూరుటౌన్: అంగన్వాడీ సమస్యలు రాష్ట్రప్రభుత్వం పరిష్కరించుకుండా కాలయాపన చేస్తే సమ్మెను ఉధతం చేస్తామని హెచ్చరించారు. ఆదివారం గూడూరులో అంగన్వాడీ కార్యకర్తలు రిలే నిరాహార దీక్షలు 13వ రోజుకు చేరుకుంది. రైతు సంఘం నాయకులు జోగి శివకుమార్, అంగన్వాడీల అధ్యక్షురాలు ఏ.ఇంద్రావతి, టి.వెంకట రామిరెడ్డి, సిఐటియు పట్టణ అధ్యక్షులు బివి.రమణయ్య, ప్రధాన కార్యదర్శి ఎస్.సురేష్, బి.చంద్రయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

పుత్తూరుటౌన్: మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆదివారం 13 రోజు అంగన్వాడీల నిరవధిక సమ్మె కొనసాగింది. ఇందులో భాగంగా రిలే నిరాహార దీక్ష శిబిరానికి సిఐటియు. జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్, జనసేన పార్టీ నాయకుడు పి.గోపి రాయల్, జి.కష్ణయ్య మద్దతు తెలిపి దీక్షలో పాల్గొన్నారు. మునికుమారి, విజయ్ కుమార్, ధనమ్మ, రాధ, లలిత, అన్నపూర్ణ, లక్ష్మి పాల్గొన్నారు.

నారాయణవనంలో..

నారాయణవనం: మండల కేంద్రం తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ చేపట్టిన నిరవధిక సమ్మె 13వ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, ఆమ్ ఆద్మీ పార్టీ సత్యవేడు నియోజకవర్గం కన్వీనర్ ఎం.నందిని మద్దతు పలికారు. ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షులు, పార్లమెంట్ కోఆర్డినేటర్ నీరుగట్టు నగేష్ విచ్చేసి మద్దతు ప్రసంగించారు. జిల్లా కమిటీ సభ్యులు టి.జయకుమార్, గిరీష్, సూర్య, అజిత్, వెంకట్ పాల్గొన్నారు

తిరుపతి టౌన్: అంగన్వాడీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం సాయంత్రం సుందరయ్య నగర్‌లో లబ్ధిదారులతో కొవ్వొత్తుల ప్రదర్శన చేయడం జరిగింది. ఆదివారం అంగన్వాడీల సమ్మె 13వ రోజు కొనసాగింది. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వాణిశ్రీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము సమ్మె చేస్తున్నప్పటికీ పిల్లలు గర్భిణీ మహిళలు అందరూ తమకు మద్దతు ప్రకటించారని తెలిపారు. సిఐటియు నాయకులు బుజ్జమ్మ, టి.సుబ్రమణ్యం, జి.బాలాజీ, నగర ప్రధానకార్యదర్శి కే.వేణుగోపాల్,తంజావూరు మురళి, జి.వాసు, సుశీల రాణి పాల్గొన్నారు.

ఆదివారం చంద్రగిరిలో పెరిగిన ధరలకు అనుగుణంగా అంగన్వాడీలకు కనీస వేతనాలు పెంచాలని, గాడ్యూటీ అమలు చేయాలని కోరుతూ జగనన్న జీతం పెంచకపోతే ఆత్మహత్యలు శరణ్యం అంటూ మెడకు ఉరి తాళ్ళు వేసుకొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చేశారు. 13 రోజుల నుంచి సమ్మె చేస్తుంటే ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేస్తూ అంగన్వాడీ టీచర్లను మోసం చేస్తుందన్నారు. సిఐటియు జిల్లా నాయకులు ఎస్.జయచంద్ర, యూనియన్ జిల్లా కార్యదర్శి వాణిశ్రీ, ప్రియా, నాగరాజమ్మ, పద్మ, సుజాత, లీల, నాగభూషణమ్మ, విజయ కుమారి పాల్గొన్నారు.

పుత్తూరులో..

వెంకటగిరిలో..

పిచ్చాటూరు: స్థానిక శిశుసంక్షేమ ప్రాజెక్టు కార్యాలయం వద్ద 13వ రోజు సమ్మెలో భాగంగా ఆదివారం అంగన్వాడీలు ఒంటి కాలుపై నిలబడి నిరసన తెలిపారు. రిలే దీక్ష చేస్తున్న అంగన్వాడీలకు టిడిపి మాజీ ఎంపీపీ దంపతులు మధుబాల పద్మనాభ రాజులతోపాటు ఆ పార్టీ నాయకులు సమ్మెకు సంఘీభావం తెలిపారు. టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగ ఉపాధ్యక్షులు డి. పద్మనాభం రాజు రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. అలాగే సమ్మెలో పాల్గొంటున్న 398 మంది కార్యకర్తలు ఆయాలకు ఒక రోజు భోజన ఏర్పాట్లు కల్పిస్తామని ప్రకటించారు.

వెంకటగిరి: స్థానిక ఐసిడిఎస్ ఆఫీసు వద్ద సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు చేపట్టిన ఆదివారం సమ్మె, రిలే నిరాహార దీక్షలు 13వ రోజు కొనసాగించారు. యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి ఎన్.స్వరూప రాణి, మండల అధ్యక్షురాలు సుభాషిని యాదవ్ పాల్గొన్నారు.

రేణిగుంటలో..

చంద్రగిరిలో..

గూడూరులో..

తిరుమలలో వేడుకగా చక్రస్నానం

ప్రజాశక్తి- తిరుమల : తిరుమలలో వైకుంఠ ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని చక్రస్నాన మహోత్సవాన్ని టీటీడీ శాస్త్రోక్తంగా నిర్వహించింది. తెల్లవారు జామున శ్రీవారి మూలవిరాట్టుకు ప్రాతకాల కైంకర్యాలు ముగిసిన అనంతరం గర్భాలయం నుండి శ్రీవారి సుదర్శన చక్రాన్ని అర్చకులు ఆలయం వెలుపలకు తీసుకొచ్చి పల్లకిలో మాడవీధిలో ఊరేగింపుగా పుష్కరిణికి తీసుకెళ్లారు. ఈసందర్భంగా వారహస్వామి ఆలయ ప్రాంగణంలో సుదర్శన చక్రానికి సుగంధపరిమళ ద్రవ్యాలతో అర్చకులు అభిషేకాని నిర్వహించారు. అనంతరం వేదమంత్రోచ్చరణల నడుమ శుభముహూర్తంలో పుష్కరిణిలో చక్రాన్ని మూడుసార్లు ముంచడంతో ద్వాదశి చక్రస్నాన ఉత్సవం ముగిసింది. వందలాది భక్తులు, టీటీడీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు విడుదల

ప్రజాశక్తి- తిరుమల: తిరుమల శ్రీవారి భక్తులకు టీటీడీ మార్చి నెలకు సంబంధించి ప్రత్యేక ప్రవేశ దర్శనం (రూ.300 టికెట్లు) డిసెంబర్ 25వ తేదీన ఉదయం 10గంటలకు విడుదల చేస్తామని వెల్లడించింది. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలో వసతి గదుల బుకింగ్ ప్రారంభం అవుతుందని తెలిపింది.భక్తులు టిటిడి వెబ్‌సైట్ నుండి బుక్ చేసుకోవాలని కోరుతుంది.

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో

పిజి కోర్సులకు స్పాట్ అడ్మిషన్స్

ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో 28-12-2023 రోజున ఉదయం 10 గంటలకు ఎమ్‌ఏ, ఎమ్ఎస్సి కోర్సులకు స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తున్నట్టు డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రో.సువర్ణలత దేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ పీజీ సెట్ -2023 క్వాలిఫై అయ్యి ఇప్పటివరకు అడ్మిషన్ తీసుకొని వారు మాత్రమే ఈ స్పాట్ అడ్మిషన్స్‌కి అర్హులు. అర్హులైన విద్యార్థినులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరుకావల్సినిదిగ తెలిపారు. వివరాల కొరకు వెబ్‌సైట్‌ని సందర్శించగలరన్నారు.

డయల్ యువర్ కమిషనర్, స్పందన రద్దు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: డయల్ యువర్ కమిషనర్ మరియు స్పందన కార్యక్రమాలను ఈ సోమవారం క్రిస్మస్ ప్రభుత్వ సెలవు దినం సందర్భంగా రద్దు చేయడం జరిగిందని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

డీకే బాలాజీకి ఆత్మీయ వీడ్కోలు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

తిరుపతి కొత్త జిల్లాగా ఏర్పడిన తర్వాత మొదటి జాయింట్ కలెక్టర్‌గా డీకే బాలాజీ విధుల్లో చేరి, 20 నెలల కాలంలో ఎన్నో సమస్యలకు పరిష్కారాలు చూపించారని జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి అన్నారు. ఆదివారం ఉదయం స్థానిక కలెక్టరేట్లో గతంలో తిరుపతి జేసీగా విధులు నిర్వహించి ఆరోగ్యశ్రీ సీఈఓగా బాధ్యతలు చేపట్టిన డీకే.బాలాజీకి జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు సిబ్బంది వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్, డిఆర్‌ఓ సభకు హాజరై డీకే బాలాజీని సన్మానించి వీడ్కోలు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ జీవితంలో గుర్తుండిపోయేది అధికారిగా విధులు నిర్వహించిన చోట గొప్పగా పనిచేసి ఒక బెంచ్ మార్క్ ఏర్పాటు చేశారన్నారు. ప్రజలకు, ప్రభుత్వ అధికారులకు సూచనలు ఇస్తూ అనుకున్న పనులను త్వరితగతిన పూర్తి చేయడంలో డీకే బాలాజీ ముందు వరుసలో ఉన్నారని కొనియాడారు. ఆరోగ్యశ్రీ సీఈఓ డికే బాలాజీ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో జాయింట్ కలెక్టర్‌గా భగవంతుని ఆశీస్సులతో అనేక సమస్యలకు పరిష్కారం చూపగలిగానని ప్రతి ఒక్కరికి వీడ్కోలు సభ అన్నది ఒక ఎమోషనల్ అని అన్నారు. తిరుపతి నగరంలో చాలా గహాలు రిజిస్ట్రేషన్లు జరగటం లేదని ఫిర్యాదులు అందడంతో పెద్దలు కలెక్టర్ వారిని సంప్రదించానని ఆయన ఇచ్చిన సమాధానంతోనే పరిష్కారం దొరికిందని అన్నారు. డిఆర్‌ఓ పెంచల కిషోర్, జిల్లా అధికారులు, ఆర్డీఓలు, మండల అధికారులు జెసి సేవలను కొనియాడుతూ వారిని స్ఫూర్తిగా అందరూ అలవర్చుకోవాలని తెలిపారు. సమావేశంలో కలెక్టరేట్ రెవెన్యూ అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సంకల్పం ముందు

- ఇంటర్నేషనల్ స్థాయిలో క్రీడా ప్రతిభ
- వీల్ ఛైర్ టోర్నీల్లో వీరవిజేత
- సెంచురీలతో చెలరేగి అంతర్రాష్ట్ర పోటీల్లో గుర్తింపు
- నేడే ఇంటర్నేషనల్ టీ20 మ్యాచ్
- జట్టులో కీలక ఆటగాడిగా గణేష్

వైకల్యం ఓడింది..!

చిన్నప్పటి నుంచి అతడికి క్రికెట్ అంటే మక్కువ. క్రీడా పోటీల్లో అంగవైకల్యం కారణంగా పాఠశాలలో తోటి విద్యార్థులు దరికి చేరనివ్వలేదు. ఎలాగైనా క్రికెట్ ఆడాలని తపనతో అనేక ప్రయత్నాలు చేశాడు. అతడి పట్టుదలకు అనువుగా కడప త్రిపుల్ ఐటీలో వీల్‌ఛైర్ క్రికెట్ ప్రాక్టీస్‌కు అవకాశం దక్కింది. దీంతో అక్కడ సాధన చేసి ఉత్తమ ఆట తీరును ప్రదర్శిస్తూ గుర్తింపు పొందాడు. దరికి చేరనివ్వని గల్లీ క్రికెట్ ఆటగాళ్లకు తన ధృడ సంకల్పంతో సమాధానం చెబుతున్నాడు. దశల వారీగా జిల్లా స్థాయి నుంచి ఇంటర్నేషనల్ పోటీలకు ఎంపికై నేడు నేపాల్ జట్టుతో తలపడనున్న భారత జట్టు కీలక ఆటగాడి గణేష్ ప్రస్థానం ఇది..

ప్రజాశక్తి-ఎస్ఆర్‌పురం

రైతు కుటుంబం నుంచి..

గణేష్‌ది చిత్తూరు జిల్లా ఎస్ఆర్ పురం మండలం తయ్యూరు గ్రామ పంచాయతీ 50 బసివిరెడ్డిపల్లి. అమర(తల్లి), సుబ్రమణ్యం(తండ్రి) దంపతులకు నలుగురు సంతానం. గణేష్ మూడవ కుమారుడు. పుట్టుకతోనే అంగవైకల్యంతో జన్మించాడు. వ్యవసాయమే వీరి జీవనాధారం. అమ్మనాన్న కష్టంతోనే అటు చదువులోనూ.. క్రికెట్‌లోనూ ఉన్నతంగా రాణిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు గణేష్.

పట్టుదలతో ఇంజనీరింగ్ పూర్తి..

ప్రాథమిక విద్యను ఎస్ఆర్‌పురం మండలం 49కొత్తపల్లి మిట్టలో పూర్తి చేశాడు. ఆ తరువాత ఆరవ తరగతి నుంచి ఎన్ఐటీ వరకు మెరిట్‌లో పాసై ఉచితంగానే ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని తమిళనాడు రాష్ట్రం ఎన్ఐటీ తిరుచ్చిలో బీటెక్ పూర్తి చేశాడు. బీటెక్ చదువుతూ క్రికెట్, బ్యాడ్మింటన్, డాన్స్‌లో ప్రతిభ కనబరిచాడు. కడప ట్రిపుల్ ఐటీలో క్రికెట్ ప్రాక్టీస్ చేసి ప్రస్తానాన్ని ప్రారంభించాడు.

సెంచురీలతో చెలరేగుతూ..

వీల్ ఛైర్ క్రికెట్ టోర్నీలో గణేష్ కీలక బ్యాట్స్‌మెన్‌గా ఉత్తమ ఆట తీరును ప్రదర్శించి గుర్తింపు తెచ్చుకున్నారు. బ్యాట్‌తో చెలరేగూతూ సెంచరీలు బాధుతున్నాడు. ఇటీవల జరిగిన తెలంగాణ–ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్‌లో అత్యుత్తమ ఆట తీరును ప్రదర్శించాడు. ముందుగా బ్యాటింగ్ చేసిన తెలంగాణ జట్టు 20ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 178 పరుగులు చేసింది. 179పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆంధ్రా జట్టులో గణేష్ 118 పరుగులు చేసి జట్టు విజయానికి తోడ్పాటు అందించారు. మ్యాచ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరచిన గణేష్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ మ్యాచ్ అవార్డులను ఎంపీ భరత్ చేతుల మీదుగా అందుకున్నారు.

నేడు నేపాల్‌తో జరిగే మ్యాచ్‌లో కీలక ఆటగాడిగా..

దివ్యాంగుల ఇంటర్నేషన్ టీ20 క్రికెట్ సిరీస్‌కు ఎంపికైన గణేష్ ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లో ప్రాక్టీస్ చేస్తున్నాడు. ఈ నెల 25 నుంచి 28వరకు నేపాల్ జట్టుతో ఇండియా జట్టు తలపడనుంది. ఇండియా జట్టు తరుపున గణేష్ కీలక ఆటగాడిగా వ్యవహరించనున్నారు.

ప్రస్తానం ఇలా..

- 2016 డిసెంబర్‌లో కడపజిల్లా ఇడుపులపాయలో జిల్లా స్థాయి బెస్ట్ ప్లేయర్‌గా సెలెక్ట్ అయ్యాడు.
- ఏపీ ఐఐటి కాలేజీలో 2017 జనవరిలో స్టేట్ సెలక్షన్లో ఎంపికయ్యాడు.
- 2017 మార్చి హైదరాబాద్ ఎల్బి స్టేడియంలో నేషనల్ స్టేట్‌వైజ్ సెలక్షన్లో ఏపీ టీంకు సెలెక్ట్ అయ్యారు.
- 2018 సెప్టెంబర్‌లో మహారాష్ట్రలోని ఔరంగాబాద్ జిల్లాలో స్టేట్స్‌కి ఎంపిక.
- 2019 మార్చి ఢిల్లీ రాష్ట్రంలోని ద్వారకా సిటీలో ఐపీఎల్‌కి రాజస్థాన్ రాజ్వాడ టీంలో ఎన్నుకున్నారు
- 2023 డిసెంబర్ 25 నుండి 28 వరకు ఉత్తరప్రదేశ్లోని ఆగ్రాలో ఇండియాకి నేపాల్‌కి జరగనున్న దివ్యాంగుల ఇంటర్నేషనల్ టి20 సీరియస్‌కి ఎంపికయ్యారు.

స్నేహితుల తోడ్పాటు మరవలేనిది..

"స్నేహం ముందు వైకల్యం అడ్డుకాలేదు. నా సంకల్పానికి స్నేహితుల తోడ్పాటే నన్ను అడుగడుగునా గెలిపిస్తోంది. ప్రతిభ గుర్తించి నాకు ప్రోత్సహిస్తూ మనోధైర్యాన్ని నింపుతున్నారు. చిన్ననాటి నుంచి క్రికెట్ ఆడాలని నేను కన్న కలలు నెరవేరడానికి మిత్రుల తోడ్పాటూ ఉంది. కోరిన చోటికి తీసుకెళ్లి సాయం చేశారు. వెన్నంటే ఉండి అన్ని తామై నిలిచారు. మనోజ్, శేషు, పవన్, వాసు, వర్మ, గుణ, సాయి, పవన్‌కుమార్‌ల సాయం జీవితంలో మరిచిపోలేను."

- గణేష్

రోజూ వ్యాయామం చేయాలి

తిరుపతి ఆటా వాక్ థాన్‌లో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రతిఒక్కరు రోజూ గంట పాటు నడకను నిత్యవ్యాయామంగా అలవాటు చేసుకోవాలని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం విద్యార్థులకు సూచించారు. అమెరికా తెలుగు అసోసియేషన్ (ఆటా) ఆధ్వర్యంలో ఉదయం ఎస్వీ యూనివర్సిటీ ప్రాంగణంలో తారకరామా స్టేడియం నుండి మహతి ఆడిటోరియం వరకు జరిగిన వాక్ థాన్ 2023 కార్యక్రమానికి ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి వాక్ థాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ యువత వ్యాయామాన్ని ప్రతిరోజు తమ నిత్యఅలవాటుగా మార్చుకోవడం ద్వారా మనం ఆరోగ్యంగా ఉండగలమని అన్నారు. అలాగే యువత ఆరోగ్య పరిరక్షణ పట్ల ప్రత్యేక దష్టి సారించి యోగ, మెడిటేషన్ వంటి కార్యక్రమాలను అలవర్చుకోవాలని సూచించారు. సోషల్ మీడియా ద్వారా ఆరోగ్య పరిరక్షణ సూత్రాలను సమాజానికి అందించి మంచి సాధనంగా వినియోగించాలని ఎమ్మెల్సీ సుబ్రహ్మణ్యం సూచించారు. ఈ కార్యక్రమానికి సభ అధ్యక్షత వహించిన ఆటా అధ్యక్షురాలు మధు బొమ్మినేని మాట్లాడుతూ ఆటా ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల్లో చేస్తున్న సేవా కార్యక్రమాలు, ప్రభుత్వాలకు అందిస్తున్న తోడ్పాటును వివరించారు. ఎలెక్ట్ ప్రెసిడెంట్, ఆటా వేడుకల చైర్ జయంత్ చల్లా మాట్లాడుతూ ఆటా చేపడుతున్నటువంటి సమాజ సేవాకార్యక్రమాలను గురించి వివరించారు. కార్యక్రమంలో ఆటా ట్రెజరర్ సతీష్‌రెడ్డి, పాస్ట్ ప్రెసిడెంట్ పరమేష్ భీమ్‌రెడ్డి, ట్రస్టీ కాశీకొత్త, మీడియా కోఆర్డినేటర్ ఈశ్వర్ బండా, అనిల్‌కుమార్ బోయినపల్లి,ఎస్వీ యూనివర్సిటీ రూషా విభాగం అధికారి వంశీ, ఎస్‌వియు అధ్యాపకులు, పాల్గొన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

హెల్పింగ్ హాండ్స్ సంస్థ సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం అన్నారు. హెల్పింగ్ హాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక ప్రతిభావంతులకు ఇంటి సరుకులు, దుప్పట్లు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ గత 12 ఏళ్లుగా నిర్విరామంగా దివ్యాంగులకు చేయూత అందించడం అభినందనీయమన్నారు. అసంత సేవలు మరింత విస్తతం కావాలని ఆకాంక్షించారు. మునీర్ బాషా, గరికపాటి రమేష్, రాజేశ్వరరావు, కంఠా ఉదయ్, బాబా ఫరీద్, ఢిల్లీ కుమార్, మునికష్ణ, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్తు షాక్ మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

పోలీసులకు వినతిపత్రం అందించిన సిపిఎం నాయకులు దాసరి జనార్ధన్

ప్రజాశక్తి-కెవిబిపురం: కెవిబి పురం మండలం లోని ఓళ్లూరు గిరిజ న కాలనీ కి చెందిన సురేష్ పనికి వెళుతుండగా పాతపాలెం వ్యవ సాయ భూములలో విద్యుత్ షాక్ తో మర ణించాడని, అతని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదు కోవాలని, ప్రమాదా నికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం సత్యవే డు నియో జకవర్గ ఇన్‌ఛార్జి దాసరి జనార్ధన్ డిమాండ్ చేశారు. బాధితు లతో కలసి ఆదివారం కెవిబి పురం పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. ఏఎస్‌ఐ లోకనాథంతో దాసరి జనార్ధన్ మాట్లాడుతూ నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి బాధిత కుటుంబానికి పరిహారం వచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు తమ పంట పొలాల వద్ద విద్యుత్తు తీగ లను వేయడమే నేరమని, ఒక గిరిజన యువకుడు మరణిస్తే ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా అడవి లో కి తీసుకెళ్లి అతని మృత దేహాన్ని పూడ్చి పెట్టడం దారుణం అన్నా రు. నాగరిక సమాజంలో బతుకుతున్నా ఇలాంటి అనాగరిక చర్యలకు పాల్పడడం దారుణ మన్నారు. గిరిజ నుడని నిర్లక్ష్యం చూపడం తగదన్నారు. ఈ సంఘ టనతో ఇద్దరు చిన్న ఆడపిల్లలు వున్న అతని భార్య, అతని తల్లి నిరాశ్ర యు లయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి బాధిత గిరిజన కుటుంబానికి 5 ఎకరాల భూమి, 25 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాధితుడి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: జిల్లా ప్రజలకు పలువురు ప్రజాప్రతినిధులు, పలువురు జిల్లా అధికారులు ఆదివారం క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్‌ని పురస్కరిం చుకుని జిల్లాలోని ప్రజలు భక్తి శ్రద్ధలతో కోవిడ్ నిబంధనలు పాటిస్తూ జరుపుకోవాలని ఉప ముఖ్యమంత్రి, ఎక్సైజ్ , జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కె నారాయణ స్వామి , రాష్ట్ర విద్యుత్తు, అటవీ భూగర్భ గనుల శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, రాష్ట్ర పర్యాటక, యువజన క్రీడా శాఖా మంత్రి ఆర్‌కె రోజా, చిత్తూరు, తిరుపతి ఎంపీలు రెడ్డప్ప, మద్దిల గురుమూర్తి, జిల్లా పరిషత్ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి, ఎస్పి పరమేశ్వర్ రెడ్డి, జిల్లాకు చెందిన శాసన మండలి సభ్యులు, శాసన సభ్యులు, జే.సి శుభం బన్సల్, డి ఆర్ ఓ పెంచల కిషోర్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగం, ప్రేమ, కరుణ గొప్పతనాన్ని ఏసుక్రీస్తు తన బోధనలు ద్వారా విశ్వ మానవాళికి తెలిపారని, ఏసుక్రీస్తు గొప్ప శాంతి దూత, కరుణామయుడు అని, క్రైస్తవ సోదర సోదరీమణులు అందరూ క్రిస్మస్ వేడుకలను ఘనంగా, ఆనందోత్సాహాల మధ్య కోవిడ్ నిబంధనలు పాటిస్తూ జరుపుకోవాలని వారు పేర్కొన్నారు.

లెక్కలు లేని నగదు స్వాధీనం

సీజ్ చేసిన నగదును చూపుతున్న పోలీసులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఎలాంటి లెక్కలు లేకుండా బస్సులో తరలిస్తున్న 55 లక్షలా 87 వేల 80 రూపా యలను సీజ్ చేసి విచారి స్తున్నామని డిఎస్‌పి సూర్య నారాయణ రెడ్డి తెలిపారు. గూడూరులోని గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ సూర్య నారాయణ రెడ్డి ఆదివారం మీడియా సమా వేశం నిర్వహించారు. పట్టుబడ్డ 55లక్షలా 87వేల80 రూపాయల నగదును మీడియాకు చూపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ హైదరాబాద్ నుండి చెన్నై వైపు వెళ్లే ట్రావెల్ బస్సులో నగదు వెళుతోందని అందిన సమా చారం మేరకు పోలీసులు గూడూరు సమీపంలోని జాతీయ రహదారిపై తనిఖీలు చేపట్టగా 55 లక్షలా 87వేల 80 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నా రన్నారు. నగదుతో పాటు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని తెలిపారు. బస్సు బెడ్‌ల కింద ఉంచిన నగదును గుర్తించామని పేర్కొన్నారు. పట్టుబడ్డ నగదుకు ఎలాంటి పత్రాలు లేవని, అందుకే సీజ్ చేశామన్నారు. బంగారం కొనుగోలుకు కోసం చెన్నైకు వెళుతున్నట్లు సంబంధిత వ్యక్తులు తెలిపారన్నారు. ఈ సమావేశంలో రూరల్ సిఐ దశరథ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

సిఎంను కలిసిన వైసిపి నాయకులు

సిఎంను కలిసిన నాయుడుపేట వైసిపి నాయకులు

ప్రజాశక్తి-నాయుడుపేట: క్రిస్మస్ సందర్భంగా నాయుడుపేట వైసిపి నాయకులు సిఎం జగన్‌మోహ న్‌రెడ్డి ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదివారం ఉద యం ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద అతని తండ్రి, మాజీ ముఖ్య మంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయుడు పేట వైసిపి పట్టణ అధ్యక్షులు, నాయుడు పేట మున్సిపల్ వైస్ ఛైర్మన్ షేక్ రఫీ ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డిని కలిసి వారికి, వారి కుటుంబానికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు కాళహస్తి నియోజకవర్గ వైసిపి పరిశీలకులు ఓడూరు గిరిధర్ రెడ్డి, రాష్ట్ర రైతు విభాగ అధ్యక్షులు కళత్తూరు రామ్మోహన్ రెడ్డి, రాకేష్ రెడ్డి, మరి కొందరు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పిడబ్ల్యుడి ఫెడరేషన్‌కు అండ: ముప్పాళ్ల

పిడబ్ల్యుడి నాయకులు మాధవ్‌ను సన్మానిస్తున్న ముప్పాళ్ల సుబ్రమణ్యం

ప్రజాశక్తి - వెంకటగిరి: పిడబ్ల్యుడి ఫెడరేషన్‌కు తాము సహాయ సహ కారాలు అందించి అండ గా నిలుస్తామని వైసిపి రాష్ట్ర యూత్ సెక్రటరీ ముప్పాళ్ల సుబ్రహ్మణ్యం పేర్కొ న్నారు. స్థానిక వెంకట గిరిలో ప్రత్యేక ప్ర తి భా వం తు డై న మునగా పాటి మాధవ్ పిడబ్ల్యుడి ఫెడరేషన్ వెంకటగిరి మండల సెక్రటరీగా విశేషమైన సేవలు అందిం చినం దుకు ఈ సందర్భంగా ఫెడరేషన్ నాయకులు మాధవ్‌కు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సభలో వైసిపి రాష్ట్ర యూత్ సెక్రటరీ ముప్పాళ్ల సుబ్రహ్మణ్యం పాల్గొని వారిని అభినందించి వారి ఫెడరేషన్‌కి ఎల్లవేళలా సేవా సహకారాలు అంది స్తామని వారి సమస్యలు పరిష్కరించడంలో తాను ముందు ఉంటా నని ప్రత్యేక ప్రతిభా వంతుల సమస్యల కోసం రాష్ట్ర నాయకులు జిల్లా అధి కారులతో తక్షణమే మాట్లాడి ప్రత్యేక ప్రతిభావంతుల సమస్యలకు సత్వర పరిష్కారం చూపుతానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రతిభావంతులందరూ కలిసి ముప్పాళ్ల సుబ్రహ్మణ్యంను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మురళిగౌడ్, నాయకులు రమేష్, రాజా, చలమయ్య, మురళి, మాధవి పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పట్టణంలోని ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ జడ్పీ హైస్కూలులో 1985 –86 సంవత్సరం పదవ తరగతి చదివి న విద్యార్థిని విద్యార్థు లు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శ్రీనివాస బీఈడీ కళాశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆనాటి జ్ఞాపకాలను నెమర వేసుకొని ఒకే వేదికపై అందరూ చేరారు. 36 సంవత్స రాల తరువాత ఒకరిని ఒకరు ఆత్మీయంగా పలక రించు కుంటూ ఆనందం గా గడిపారు. ఈ కార్యక్రమం నిర్వాహకులు బాలాజీ రావు, మధు, చంద్ర మౌళి, లక్ష్మీ, రేవతి, మురళి, ఎబ్బూరు మోహన్ నిర్వహించారు.



వైసిపి యువజన అధ్యక్షులు పృథ్వీకృష్ణ యాదవ్‌ను సన్మానిస్తున్న వైసిపి నాయకులు

యువజన అధ్యక్షునిగా పృథ్వి కృష్ణ యాదవ్

ప్రజాశక్తి - ఓజిలి: మండల వైసిపి యువజన అధ్యక్షులుగా బట్టా పృథ్వి కృష్ణ యాదవ్‌ను నియమించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా వివిధ మండలాలకు వైసిపి మండల యువజన అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. మండల యువజన అధ్యక్షులుగా బట్టా పృథ్వి కృష్ణ యాదవ్ ఎన్నిక కావడంతో సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులు బట్టా పృథ్వి కృష్ణ యాదవ్ , బట్టా అనిల్ కుమార్ యాదవ్ కు అభినందనలు తెలిపారు.

శ్రీలక్ష్మి భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

ఆర్కిటెక్ డిజైనర్ భార్య మృతికి నివాళులు

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి రూరల్ మండలం ఆర్కిటిక్ డిజైనర్ రాజేంద్ర భార్య శ్రీలక్ష్మి అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం గాంధీపురంలోని నివాసం వద్ద ఆమె భౌతిక కాయానికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, సతీమణి లక్ష్మీ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అధైర్యపడవద్దని ధైర్యంగా ఉండాలంటూ భరోసా కల్పించారు. ఎమ్మెల్యే వెంట వైస్ ఎంపీపీ విడుదల మాధవ రెడ్డి, సర్పంచ్ మాన్నూరు లక్ష్మీ శివ, సెల్వం, మూలం బాబు ఉన్నారు.

రూ.1.20 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

బాధితునికి చెక్కు అందిస్తున్న తుడ ఛైర్మన్

ప్రజాశక్తి - క్యాంపస్ : తుడా ఛైర్మెన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి చేతుల మీదుగా సప్తగిరికాలనీ పంచాయతీలోని అంబేద్కర్ కాలనీకి చెందిన చంద్రమౌళికి రూ.1.20 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ ను అందించారు. తుమ్మలగుంటలోని తుడా ఛైర్మన్ నివాసం వద్ద ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆపదలో ఆపద్బాంధవుడుగా నిలిచారని ఈ సందర్భంగా చెక్కును అందుకున్న మోహిత్ రెడ్డికి బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు. ప్రాణాంతకమైన అనారోగ్యం బాధిస్తుంటే.. మెరుగైన వైద్య సేవలకు అప్పు చేసి మరీ వైద్యం చేయించుకున్నట్లు బాధితుడు చంద్రమౌళి వాపోయారు. చేసిన అప్పు తీర్చేందుకు ఏమి చేయాలో ఆలోచించలేని పరిస్థితుల్లో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ద్వారా సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకున్నానని, నేడు రూ.1.20 లక్షలు రావడం సంతోషంగా ఉందని చంద్రమౌళి పేర్కొన్నారు. బాధితుడి వెంట సప్తగిరి కాలనీ ఉపసర్పంచ్ అశోక్ రెడ్డి, లక్ష్మీనారాయణ ఉన్నారు.

నియోజకవర్గ అభివృద్ధి పులివర్తి నాని బాధ్యత : పులివర్తి సుధా రెడ్డి

ప్రచారం నిర్వహిస్తున్న సుధారెడ్డి

ప్రజాశక్తి - క్యాంపస్ : 2024 ఎన్నికల్లో టిడిపి అధికారం లోకి రావడం ఖాయమని టిడిపి చిత్తూరు పార్లమెంటరీ అధ్యక్షుడు, చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి స్పష్టం చేశారు. 'మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని' 'బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా చంద్రగిరి పట్టణంలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా మండల నాయకులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. పులివర్తి సుధారెడ్డి ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ప్రతి పంచాయతీ, గ్రామ సమస్యలకు పరిష్కారం

టిడిపి అధికారంలోకి రాగానే చంద్రగిరి నియోజకవర్గంలో ప్రతి పంచాయతీ, గ్రామాలలో సమస్యలు తీరుతాయని పులివర్తి సుధారెడ్డి అన్నారు. మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని కార్యక్రమంలో వస్తున్న సమస్యలను ఎప్పటికప్పుడు నోట్ చేసుకుంటున్నామన్నారు. ప్రతి వీధి, ప్రతి గ్రామంలో సమస్యలు వెల్లువెత్తు తున్నాయని చెప్పారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యల పరిష్కారానికి పులివర్తి నాని కృషి చేస్తారని ఆమె అన్నారు.

నియోజకవర్గ అభివృద్ధి నాని బాధ్యత

చంద్రగిరి నియోజకవర్గంలో టిడిపి గెలిచి దాదాపు 30ఏళ్లు అవుతుందని ఒక్క అవకాశం ఇస్తే పులివర్తి నాని అభివృద్ధికి అర్థం చెపుతానని ఆమె పేర్కొన్నారు. డ్రైనేజీ, కాలువల సమస్యలు, రోడ్ల సమస్యలు, తుపాన్లకు కొట్టుకుపోయిన బ్రిడ్జిల నిర్మాణం, రైతాంగం సమస్యలు నియోజకవర్గాన్ని పట్టి పీడిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగున్న ఏళ్లుగా పరిస్థితులు మరింత దారుణంగా తయా రయ్యా యని దుయ్యబట్టారు. ఒక్క అవకాశం ఇస్తే ప్రతి ఇంటికి పెద్ద కొడుకులా నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి పరుస్తారని వివరించారు.

మినీ మేనిఫెస్టోకు అద్భుత ఆదరణ

మహానాడు వేదికగా మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన మినీ మేనిఫెస్టోకు అద్భుతమైన ఆదరణ లభిస్తోందన్నారు. టిడిపి ప్రకటించిన మినీ మేనిఫెస్టో ద్వారా ఒక్కో కుటుంబానికి ఏటా రూ.1.22 లక్షలు ఆర్థిక సాయం అందుతుందని ఆమె స్పష్టం చేశారు. అదనంగా 3 గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కలుగుతుందని చెప్పారు. రాష్ట్ర సంపద పెంచాలన్న, పేదలకు పంచాలన్నా టిడిపి తోనే సాధ్యమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జనసేన నాయకులు, కార్యకర్తలు, మహిళలు ,పాల్గొన్నారు.

ఫల సరుకులు పంపిణీ

క్రిష్టియన్ సోదరుల కుటుంబాలకు ఫల సరుకులు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాతలు

ప్రజాశక్తి - గూడూరు రూరల్: గూడూరు పట్టణంలోని ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో పొణకా ఆదిశేషారెడ్డి జ్ఞాపకార్థం అతని కుమారుడు పొణకా మల్లికార్జున రెడ్డి సంపూర్ణ సహకారంతో గూడూరులోని జానకిరామ్ పేటలో క్రిస్మస్‌ను పురస్కరించుకొని నిరుపేదలైన 15 క్రిష్టియన్ కుటుంబాలకు 18 రకాల ఫల సరుకులు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రేయ రియల్ ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత బాబు ఆగస్టస్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాబు అగస్టస్ మాట్లాడుతూ ప్రగతి సేవా సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయం అన్నారు. ఈ సంస్థ అభివృద్ధి కోసం తన వంతు సహాయంగా 2 లక్షల రూపాయలను ప్రకటించారు. ఈకార్యక్రమంలో క్లబ్‌అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్,ఉపాధ్యక్షుడు బండి ధనంజయ రెడ్డి,ట్రెజరర్ కాటూరు శ్రీనివాసులు, శ్రేయ రియల్ ఎస్టేట్స్ ప్రతినిధి జోనా, మురళీ సింగ్(టీచర్), కార్యవర్గ సభ్యులు వాకాటి రామ్మోహన్ రావు, గ్రానైట్ ప్రభాకర్, ఐటిఐ ప్రభాకర్, ధయాకర్(ఎక్సైజ్ డిపార్టుమెంట్), మల్లికార్జున(టీచర్), వాచ్ షాప్ రాము, కుమార నాయుడు పాల్గొన్నారు.

గుంతల రోడ్డుకు మరమ్మతులు

రోడ్డుపై గుంతలను పూడ్చివేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: ఇటీవల తుపాను కారణంగా దెబ్బతిన్న రోడ్డుకు సర్పంచుల ఆర్థిక సాయంతో మట్టితో గుంతలను పూడ్చి వేశారు. మండలంలోని ఆలత్తూరు రోడ్డు గతంలో తుపానుకు పూర్తిగా దెబ్బ తిన్నాయి. ఆ మార్గంలో ఆలతూరు పంచాయతీ, కండ్రిగ పంచాయతీ, పుత్తూరు పంచాయతీకి సంబంధించిన అనేక గ్రామ ప్రజలు, ద్విచక్ర వాహనాలు శ్రీకాళహస్తి నుండి పుత్తూరుకు బస్సులు కూడా వెళుతుంటాయి. ఈ మార్గంలో అనేక మంది విద్యార్థిని విద్యార్థులు పాఠశాలలకు, కళా శాలలకు వెళ్లేందుకు నానా ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. ప్రభుత్వం స్పందించక పోవడంతో మూడు పంచాయతీల సర్పంచులు కలసి సొంత నిధులతో తిరుపతి జిల్లా వైసిపి సోషల్ మీడియా కన్వీనర్ ప్రసాద్ పాల్ జెసిపి సహాయంతో ఈ మార్గంలో గుంతలను మట్టితో పూడ్చి వేశారు. గుంతల పూడ్చివేతకు కృషి చేసిన మీడియా కన్వీనర్ ప్రసాద్ పాల్‌కు మూడు పంచాయతీల ప్రజలు, విద్యార్థిని విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటి కైనా ఆర్‌అండ్‌బి అధికారులు స్పందించి ఈ రోడ్డు మరమ్మ తులు చేపట్టాలని కోరు తున్నారు. కోరుతున్నారు. ఈ రోడ్డు విష యమై పలుమార్లు అనేక పత్రికలలో కథనాలు వచ్చినా పట్టించుకునే నాథుడే లేక పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి సమయంలో ఈ రోడ్డుపై ప్రయాణిం చాలంటే అనేక ఇబ్బందులకు గురి కావాల్సి వస్తోందని వెంటనే మరమ్మ తులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

స్పార్క్ ఆఫ్ ది ఇయర్ గా 'గుల్సమర్'

ఆంగ్ల భాషా ప్రావీణ్యం పెంపునకే నిర్వహణ : ఎమరాల్డ్ డైరెక్టర్లు

గుల్సమర్ కు బహుమతి ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగర పరిధిలోని ఎల్‌ఐసి మార్గంలోని ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు స్పార్క్ 2023 పోటీలు ఘనంగా నిర్వహించినట్లు ఎమరాల్డ్స్ కళా శాల ఉప సంచాలకులు మునిరత్నం తెలి పారు. స్పార్క్ ఆఫ్ ది ఇయర్ కార్యక్ర మానికి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమరాల్డ్స్ విద్యా సంస్థల డైరెక్టర్లు, గిరిధర్ విశ్వనాథ్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థుల్లో ఆంగ్లభాషపై ప్రావీణ్యం పెంపొందించడానికి వినూత్నంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు వారి లక్ష్యాలను చేరుకోవడంలో ఈ పోటీలు ఎంతగానో దోహదపడతాయని, తద్వారా వారి లక్ష్యసాధన సులభం అవుతుందన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్ నేడు చాలా అవసరమని, విద్యార్థులు తదనుగుణంగా విద్యాభ్యాసనలో ప్రణాళికలు వేసుకో వాలన్నారు. ప్రజెంటేషన్, గ్రూప్ డిస్కషన్, ఎక్స్ టెంపర్ తదితర విభాగాలలో పోటీలు నిర్వ హించామన్నారు. ఈ పోటీలలో గుల్సమర్ స్పార్క్ ఆఫ్ ది ఇయర్ గా నిలిచి ఐదువేల రూపాయల ప్రోత్సాహక నగదును అందు కున్నారన్నారు. ద్వితీయ స్థానంలో నదియా నిలిచి 3 వేలు, తృతీయ స్థానంలో సాహద్ అలీ 2 వేల రూపాయల నగదు బహుమతి గెలుచుకున్నారన్నారు. న్యాయ నిర్ణేతలుగా జాషు వా, భాను కిరణ్, పాల్ సుధాకర్ వ్యవహ రించారన్నారు. ఈ కార్యక్రమంలో జానకిరామ్, శ్రీనివాసులు, పార్థసారథి, నాథముని, ప్రిన్సిపాల్ మదనమోహన్, గ్రేస్ వినీల, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశంసా పత్రం అందుకుంటున్న రావిళ్ల మాధవ నాయుడు

వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా రావిళ్ల మాధవ నాయుడు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : విశాఖపట్టణం ఆంధ్ర యూనివర్సిటీలో జరిగిన ఇంటర్నేషనల్ వాకర్స్ 32వ వార్షికోత్సవంలో డిస్టిక్ 302 ఇంటర్నేషనల్ వాకర్స్ గవర్నర్ గా పుత్తూరు వాకర్స్ క్లబ్ కు చెందిన రావిళ్ల మాధవ నాయుడుని ఏకగ్రీవంగా ఎన్నుకుని నియామక పత్రాన్ని ఇంటర్నేషనల్ వాకర్స్ అధ్యక్షులు డాక్టర్ సుంకర రవీంద్ర అందించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వాకర్స్ చీఫ్ అడ్వైజర్ డాక్టర్ రవి రాజు, ఏరియా 3 వైస్ ప్రసిడెంట్ కొండూరు శరత్ కుమార్ రాజు, కోఆర్డినేటర్ కోనేటి రవిరాజు, పుత్తూరు వాకర్స్ క్లబ్ కార్యదర్శి ముని కృష్ణయ్య, రీజనల్ కౌన్సిలర్ ప్రతాప్ పాల్గొన్నారు. ఈ వాకర్స్ గవర్నర్ పరిధిలో ఆంధ్రప్రదేశ్ ,కర్ణాటక, కేరళ, తమిళనాడు, పాండిచ్చేరి పరిధిలోని వాకర్స్ క్లబ్బులన్నీ ఉంటాయి. ఈ పరిధిలో 126 వాకర్స్ క్లబ్ లు నడుస్తున్నాయని తెలిపారు.

టిడిపి పథకాల కరపత్రాలు చూపుతున్న మహిళలు

చంద్రన్నతోనే మహిళా సాధికారత: టిడిపి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : చంద్రబాబుతోనే మహిళా సాధికారత సాధ్యపడుతుందని టీడీపీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాధ్యుడు నెమళ్ళూరు బుజ్జి అన్నారు. 'బాబు ష్యూరిటీ – భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా ఆదివారం శ్రీకాళహస్తి పురపాలక సంఘం యాభై రెండవ బూత్ పరిధిలోని కుటుంబాలను కలిసి, రాబోయే ఎన్నికలలో టిడిపి విజయం సాధించి అధికారం చేపట్టిన తరువాత అమలు చేయబోయే సంక్షేమ – అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం స్వయం ఉపాధి రంగానికి ఆర్థిక తోడ్పాటు అందించకుండా, సమాజ అభివృద్ధిలో సగ భాగాన్ని పంచుకునే మహిళా శక్తిని నిర్వీర్యం చేసి కోట్లాది కుటుంబాల వెన్ను విరిచాడని బుజ్జి మండిపడ్డారు. మహిళా శక్తికి పునరుజ్జీవం పోసేది చంద్రబాబు నాయుడని కితాబిచ్చారు. ఈ కార్యక్రమంలో బిసి వెల్ఫేర్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి డా ఎం.ఉమేష్ రావు, యాభై రెండవ బూత్ కన్వీనర్ షేక్ జిలానీ, షేక్ రియాజ్, మొఘల్ అహ్మద్, షేక్ జుంలేషా, మొఘల్ మీర్జావలి, తెలుగు మహిళలు షేక్ ఫైజూన్, షేక్ అఫ్రోజ్, షేక్ సబీనా, షేక్ నూరి, షేక్ ఆసియా పాల్గొన్నారు.

వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

వస్తువుల కొనుగోలుపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-నాయుడుపేట: ప్రతి వస్తువు కొనుగోలుపై వినియోగదారులకు అవగాహన ఉండాలని ఐఆర్‌టిపిఎస్ జిల్లా కన్వీనర్, చెరు వుల పరిరక్షణ కమిటీ సభ్యులు తీగల భాస్కర్ అన్నారు. జాతీయ విని యోగ దారుల దినో త్సవం సంద ర్భంగా విని యోగ దారుల హక్కు ల పరిరక్షణ న్యాయ సభకు సంబంధిం చిన కరపత్రాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక చోట్ల వస్తువుల కొనుగోలులో వినియోగదారులు నష్టపోతున్నారని తెలిపారు. వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు ప్రతి ఒక్కరూ తప్పని సరిగా వస్తువులు నాణ్యత, తయారు తేదీ, ఐఎస్ఐ ఉందా? లేదా అని ఖచ్చితంగా చూసి వస్తువులు కొనుగోలు చేయవలసిన బాధ్యత వినియోగదారుడే తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల పరిరక్షణ న్యాయసభ ఉపాధ్యక్షులు యన్ అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

వైకుంఠ ద్వాదశి ఏర్పాట్ల పర్యవేక్షణ

ప్రజాశక్తి - క్యాంపస్ : తుమ్మలగుంట శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామిని వైకుంఠ ద్వాదశి పర్వదినాన భక్తులు దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం నుంచి భక్తులు తరలి వచ్చారు. ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు నిరంతరాయంగా తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచారు. పోలీసులు వాహన పార్కింగ్ ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

చక్రస్నానం

వైకుంఠ ద్వాదశి పర్వదినాన తుమ్మలగుంట ఆలయం ఎదుట ఉన్న కోనేరులో సుదర్శన చక్రత్తాళ్వార్‌కు శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. అంతకుముందు అర్చకులు వేడుకగా తిరుమంజనం నిర్వహించారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన భక్తులకు దర్శనభాగ్యం కల్పించిన క్రమంలో సకల దోష నివృత్తికై చక్రత్తాళ్వార్‌కు చక్రస్నానం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని ఆలయ ప్రధాన అర్చకులు అనంతాచార్యులు పేర్కొన్నారు.

వైకుంఠ ద్వాదశి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

క్రైం న్యూస్

విలేకరులతో మాట్లాడుతున్న డిఎస్‌పి భీమారావు

విద్యాలతను హతమార్చింది ప్రియుడి మొదటి ప్రియురాలే..!

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి, శ్రీకాళహస్తి రూరల్: శ్రీకాళహస్తి మండలం అమ్మపాళెం సమీపంలోని పంట కాలువలో మృతదేహమై తేలిన విద్యాలత అలియాస్ విద్యను హత్య చేసింది ఆమె ప్రియుడు శశికుమార్ మొదటి ప్రియురాలు సుజాత అని శ్రీకాళహస్తి డీఎస్పీ భీమారావు తెలిపారు. శ్రీకాళహస్తి రూరల్ పోలీస్ స్టేషన్లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హత్యకు దారితీసిన తీరును డీఎస్పీ వివరిస్తూ తిరుచానూరు సమీపంలోని కొత్తపాళెం ఎస్టీకాలనీకి చెందిన లీలావతి (50), రవికుమార్ల కుమారుడు శశికుమార్ అదే కాలనీకి చెందిన ఇద్దరు బిడ్డల తల్లిగా ఉంటూ భర్త, పిల్లలను వదిలేసిన సుజాత (36)ను ఎనిమిదేళ్లుగా తన ఇంట్లోనే ఉంచుకుని సహజీవనం సాగిస్తున్నాడు. కాగా సుజాతపై మోజు తగ్గగానే ఆరు నెలల క్రితం అదే తరహాలో భర్తతోపాటు ఇద్దరు పిల్లలను వదిలేసిన విద్యాలతను తీసుకెళ్లి తన ఇంట్లోనే ఉంచి ఇద్దరితో ఏకకాలంలో సహజీవనం సాగిస్తున్నాడు. శశికుమార్ తో విద్యాలత సహజీవనం చేయడం నచ్చని సుజాత తరచూ విద్యాలతతో గొడవకు దిగేది. ఇదే సమయంలో ప్రియుడు శశికుమార్, విద్యాలతలు కువైట్ వెళ్లాలని చర్చించుకుంటుండటంతో తన ప్రియుడు తనకు దూరమైపోతాడని భావించిన సుజాత ఎలాగైనా విద్యాలత అడ్డుతొలగించుకోవాలని భావించింది. విద్యాలతను మట్టుపెట్టాలని సుజాత, శశికుమార్ తల్లి లీలావతితో కలిసి వ్యూహరచన చేసింది. ఈనెల 16న రాత్రి శశికుమార్ ఇంట్లో లేని సమయంలో విద్యాలత నిద్రిస్తుండగా ముఖంపై దిండుతో అదిమి హతమార్చారు. మృతదేహాన్ని ప్లాస్టిక్ గోనెసంచిలో మూటగట్టారు. ఓ ఆటోను బాడుగకు మాట్లాడుకున్న సుజాత, లీలావతి మూటను ఆటోలోవుంచి అక్కడ నుంచి శ్రీకాళహస్తికి బయలుదేరారు. మిట్టకండ్రిగ వద్దకు రాగానే తొండమనాడు మార్గంలో అమ్మపాళెం క్రాస్ వద్ద అర్ధరాత్రివేళలో మూటను దించుకుని 'తమ మామ కారులో వస్తాడని నీవు వెళ్లిపో' అంటూ ఆటోడ్రైవరును అక్కడి నుంచి పంపేశారు. అనంతరం సమీపంలోని పంట కాలువలో విద్యాలత మృతదేహాన్ని పడేసి దానిపై కొబ్బరి మట్టలు కప్పి అక్కడి నుంచి తాపీగా నడుచు కుంటూ మిట్టకండ్రిగకు చేరుకుని బస్సులో ఇంటికి వెళ్లిపోయారు. 17న ఉదయం కాలువలో మృతదేహం ఉన్నట్లు సమాచారం అందుకున్న శ్రీకాళహస్తి రూరల్ సీఐ అజయ్ కుమార్ సిబ్బందితో అక్కడికి చేరుకుని గుర్తు తెలియని మహిళ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతురాలి చేతిపై ఉన్న ట్యాటూకు సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం కల్పించడంతో దామినేడుకు చెందిన పుష్ప, మృతురాలు తన కుమార్తె విద్యాలతదిగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు అందించారు. దర్యాప్తు ప్రారంభించిన సీఐ నిందితులు సుజాత, లీలావతిలను అదుపులోకి తీసుకుని తమదైనశైలిలో విచారణ చేపట్టడంతో తక్కువ సమయంలోనే కేసును ఛేదించారు. ఈ మేరకు నిందితులను కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించినట్లు తెలిపారు.

రైలు ఢీకొని మృతి చెందిన గుర్తు తెలియని మహిళ

రైలు ఢీ కొని మహిళ మృతి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూ రు పట్టణంలోని రైల్వే స్టేషన్ లో గుర్తు తెలియని 60 ఏళ్ల మహిళ రైలు ఢీ కొని మృతి చెందింది. విజయవాడ నుండి చెన్నై వెళ్లే వందే భారత్ ఎక్స్ ప్రెస్ రైలుకు గూడూరులో స్టాపింగ్ లేదు. ఈ క్రమంలో భాగంగా అదే రైలు కింద పడి ఆ మహిళ దుర్మరణం చెందింది. మహిళ పట్టాలు దాటుతుండగా ప్రమాదం సంభవించిందా? లేక పట్టాలపై పడుకుని ఆత్మహత్యకు పాల్పడిందా? అనే వివరాలు తెలియలేదు. మహిళ మృతి విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించే పనిలో పడ్డారు. మృతురాలు వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో వారు ఆరా తీస్తున్నారు. ఈ మేరకు మృతదేహాన్ని శవ పంచనామా నిమిత్తం గూడూరులోని ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.